ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 36.0
కనిష్ఠం: 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:23 (శుక్ర)
సహరి: 4:43 (శని)

రణరంగ వ్యూహం

ఏలూరు, నరసాపురం లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 14 అసెంబ్లీ స్థానాల్లో ప్రతిపక్ష కూటమి అప్రమత్తమైంది. ఇన్నాళ్లు వైసీపీ ఏకపక్ష ధోరణిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని యంత్రాంగం వైఖరిని చూసిన అనుభవంతో పలుచోట్ల రాత పూర్వకంగా ఫిర్యాదులకు సిద్ధమవుతోంది. వైసీపీ అనుకూల సభల్లో, ప్రదర్శనల్లో ప్రచారంలో పాల్గొంటున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులపైన దృష్టి పెట్టారు. టీడీపీ, జనసేనలో కీలకంగా వ్యవహరిస్తున్న వారంతా నిఘా బాధ్యతలను భుజాన వేసుకున్నారు.

కూటమి అభ్యర్థులు అప్రమత్తం

కీలక నియోజకవర్గాల్లో వైసీపీకి దడ

- ఓటర్ల జాబితాపై మళ్లీ పరిశీలన.. అవకతవకలు, ఉల్లంఘనలపై దృష్టి
- వలంటీర్ల నడవడిక పైనా నిఘా.. అధికారులకు ఫిర్యాదులు
- దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

తొలుత ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా అధికార పార్టీ ఫ్లెక్సీలు, రంగులు, పోస్టర్‌లు, స్టిక్కర్‌లు ఎక్కడ కనిపించినా ఎన్నికల అధికారులు తక్షణ ఫిర్యాదుతో హోరెత్తిస్తున్నారు. గ్రామ సచివాలయాల నుంచి పశు వైద్యశాలల వరకు సీఎం జగన్ ఫొటోలు, మంత్రులు ఫొటోలే కనిపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నంలో పడ్డారు. నియోజకవర్గాల వారీగా ఈ తరహా ఫిర్యాదులు ఏరోజు కారోజుకు అధికారులకు అందడంతో పర్యవేక్షణగా చిత్రపటాలు తొలగింపులు, రంగులను వేరే రంగులతో కప్పేయడం వంటి చర్యల్లో యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే పత్రికల్లో వస్తున్న వార్తలకు స్థానిక అధికారులు స్పందిస్తున్నారు. మూడు రోజులుగా వందలాది ఫ్లెక్సీలను తొలగించారు. విగ్రహాలకు ముసుగులు వేశారు. ఫిర్యాదు అందిన క్షణంలోనే చర్యలకు సిద్ధమవుతున్నారు. అధికార వైసీపీ ఇప్పుడు కిమ్మనకుండా జరుగుతున్న తంతును మౌనంగా గమనించాల్సి వచ్చింది. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్న అన్నిచోట్లా వైరి పక్షాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఎక్కడ లోసుగు కనపడినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేకుండా చురుగ్గా వ్యవహరిస్తున్నాయి. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలే కాకుండా కీలకమైన ఏలూరు, భీమవరం, నరసాపురం, ఆచంట, పాలకొల్లుల్లో విపక్ష అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీ గీత దాటి వ్యవహరిస్తే తదనుగుణంగా ఎదుర్కొనాలని తమ కేడర్‌ను ఇప్పటికే అప్రమత్తం చేసింది. ఏం జరిగినా చూస్తు ఊరుకోవద్దు.. రాతపూర్వకంగా ఫిర్యాదుకు సిద్ధపడండి.. వాళ్ళేదో తామే గొప్ప అన్నట్టు వైసీపీ రెచ్చగొట్టేలా వ్యవహరించినా, అడ్డదారులు తొక్కినా, ప్రచారంలో దుందుడుకుగా వ్యవహరించినా వలంటీర్లు, ఇతర సిబ్బందితో ప్రత్యక్ష ప్రచారం చేయించినా చూసీ చూడనట్టు ఉండవద్దు. అందరూ అప్రమత్తం కావాలి. అనే సందేశం విపక్ష కేడర్‌కు పూర్తిగా అందింది. ఇప్పుడు అందుకనే నరసాపునం, ఏలూరు లోక్‌సభ స్థానాలు పరిధిలో వీరి దూకుడు చూసి వైసీపీలో కొంత అప్రమత్తత నెలకొంది.

కుయుక్తులను తిప్పి కొట్టాల్సిందే..

ప్రచార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో తమను కించ పరిచినట్టు, భ్రష్టు పట్టించే విధంగా ఎవరైనా పోస్టింగ్‌లు పెట్టినా, ప్రచారానికి దిగినా ఖాతరు చేయకూడదని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఒక నిర్ణయానికి వచ్చాయి. సోషల్ మీడియాలో ఎన్నికల షెడ్యూలు విడుదలకు ముందు రకరకాల ప్రచారాలతో కొంతమంది కావాలని గందరగోళం సృష్టించారని, ఇప్పుడా పరిస్థితి పునరావృతం కాకుండా కూటమి జాగ్రత్తపడుతోంది. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెంలో, నూజివీడులో కూటమి కేడర్‌లో కొంత మంది అనుభవజ్ఞులు కంటి మీద కునుకు లేకుండా పర్యవేక్షణకు దిగారు. తమపై అబద్ధాలతో దాడి చేసినా, ఫేక్ న్యూస్ తయారుచేసినా తక్షణం ఆధారాలతోసహా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సోషల్ మీడియా టీమ్‌ను అప్రమత్తం చేశారు. కుల ప్రాతిపదికన ఎటువంటి పరోక్ష దాడి జరిగినా సహించేది లేదనే సంకేతాలు బలంగా బయటకు వెళ్లాల్సిందేనని కూటమి అభిప్రాయపడుతోంది. ఓటర్ల జాబితాల పరిశీలన, తొలగించిన ఓట్లు, తప్పొప్పులను బేరీజు వేసుకుంటోంది. నామినేషన్ల స్వీకరణకు పాలకొల్లు మున్సిపాలిటీ కాకుండా ఎప్పటి మాదిరి తహశీల్దార్ కార్యాలయం కేటాయించాలని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విజ్ఞప్తి చేశారు. దాదాపు రెండు వారాలపాటు నిబంధనలు, నియంత్రాలు ఆ ప్రాంతంలో ఉంటాయి కాబట్టి ఎవరికి ఇబ్బంది కలగకూడదని కోరారు.

రిటైర్డ్ అధికారుల సాయం

ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించిన వారంతా తమకు తగిన సాంకేతిక సాయం అందించేందుకు వీలుగా రిటైర్డ్ అధికారుల సాయాన్ని తీసుకుంటున్నారు. ఎన్నికల నిబంధనావళి, మాన్యువల్‌ను ఎప్పటికపుడు పరిశీలించడం, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే యాప్‌ల పరిశీలన, మార్గదర్శకాలు అభ్యర్థులకు అందుబాటులో ఉంచడానికి రిటర్నింగ్ అధికారులకు, సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా స్వల్ప సమయంలో విజ్ఞాపనలు తయారు చేయడం వంటి పనుల్లో వీరి సాయం తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే కొందరు రిటైర్డ్ తహసీల్దార్లను తమ కార్యాలయాల్లో నియమించుకున్నారు. నామినేషన్ వరకు ఎలాంటి పొరపాట్లు జరగకుండా తామంతా నిర్విరామంగా ఎన్నికల ప్రచారంలో ఉంటున్నందున అత్యవసర పరిస్థితులను చక్కదిద్దేందుకు ఈ చర్యలు దోహదపడతాయని భావిస్తున్నారు.

టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా మహేశ్ యాదవ్ ?

ఏలూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఏలూరు లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థిగా పలువురు పోటీ పడినప్పటికీ పుట్టా మహేశ్‌యాదవ్‌వైపే టీడీపీ అధిష్ఠానం మొగ్గ చూపినట్టు తెలుస్తోంది. వివిధ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను శుక్రవారం ప్రకటించే అవకాశం ఉంది. ఏలూరు నుంచి గోరుముచ్చు గోపాల్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, కంభంపాటి రామ్మోహన్ వంటి వారంతా ఆశించినా మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడైన మహేశ్ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఈ స్థానంపై సుదీర్ఘ కసరత్తు నిర్వహించిన అనంతరం పార్టీ ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. వాస్తవానికి ఈ స్థానాన్ని సైతం బీజేపీ ఆశించి గట్టిగా పట్టు పట్టింది. ఆ మేరకు ఉన్నతస్థాయిలో వివిధ ప్రయత్నాలు సాగాయి.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

ఎంపీడీవోకు షోకాజ్ నోటీస్.. సీ-విజిల్ ఫిర్యాదు బహిర్గతం కావడంపై కలెక్టర్ సీరియస్

ఏలూరు సిటీ/ఉంగుటూరు, మార్చి 21 : సీ-విజిల్ ఫిర్యాదు బహిర్గతమైన ఘటనలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించి చేబ్రోలు గ్రామ సచివాలయం-1 పంచాయతీ కార్యదర్శి బీవీ రవిచంద్రకుమార్, ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్-కం-టైపిస్ట్ బి.అమృతలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వులు జారీచేశారు. ఎంపీడీవో శర్మకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నల్లమాడు గ్రామ శివారు రామచంద్రపురంలో గ్రంథాలయం, వాటర్ ప్లాంట్‌కు వైసీపీ రంగులు ఉండడంతో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ నెల 19న సీ-విజిల్‌యాప్‌లో ఫిర్యాదుచేశాడు. స్పందించిన అధికారులు గంటలోపే దానికి తెల్ల సున్నం వేయించారు. ఫిర్యాదుదారుల విషయాన్ని గోప్యంగా ఉంచాల్సిన సిబ్బంది అతని వివరాలు తెలిపేలా ల్యాప్‌టాప్‌లో స్ర్కీన్ షాట్ తీసి అధికార పార్టీ నాయకులకు సమాచారం అందించారు. దీంతో ఫిర్యాదుదారుడి స్నేహితుడిని వైసీపీ నాయకుడు నిలదీశాడు. ప్రభుత్వ సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గోప్యంగా ఉంచాల్సిన ఫిర్యాదు సమాచారాన్ని బహిర్గతం చేసిన బాధ్యులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

ఏలూరు టూటౌన్, మార్చి 21 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం ఉద్యోగి మహ్మద్ ఇబ్రహీంఖాన్, ఇంజనీరింగ్ సెక్షన్‌లో బోర్ ఆపరేటర్ పిట్ల మోహన్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులై వుండి కోడ్ ఉల్లంఘించినందుకు వీరిద్దరిని కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ విధుల నుంచి తొలగించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు.. సస్పెన్షన్

మొగల్తూరు, మార్చి 21:పాతపాడులో ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి ప్రసాదరాజు బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు గ్రామ వలంటీర్లు తిరుమాని శివగణేష్, రామాని శైలజలను సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో బాబ్జీరాజు గురువారం తెలిపారు. తమకు వచ్చిన ఫిర్యాదు పరిశీలించి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

వలంటీర్ తొలగింపు

కలిదిండి, మార్చి 21 : వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఒకటో వార్డు వలంటీర్ పాము నాగ సుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు ఫిర్యాదు రావడంతో విచారణ చేయగా, నిర్ధారణ కావడంతో విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.



మాదేపల్లిలో అధికారులు లేక ఖాళీగా ఉన్న చెక్‌పోస్టు

అధికారులు లేని చెక్‌పోస్ట్

ఏలూరు రూరల్, మార్చి 21 : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసుల తనిఖీలు ముమ్మరం అయ్యాయి. పలుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పోలీసులు నిరంతరం వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలోను చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ అధికారులెవరు కన్పించకపోవడం విశేషం. ఎన్నికల నేపథ్యంలో మాదేపల్లి వద్ద నెంబర్ -65, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్టాటిస్టిక్, సర్వే లింక్స్ టీమ్ (ఎస్.ఎస్.టి)ని ఏర్పాటు చేశారు. ఈ టీమ్ వచ్చి పోయే వాహనాలను చెక్‌పోస్టు వద్ద ఆపి తనిఖీ చేయాల్సి ఉంది. ఇది ఏర్పాటు చేసి రెండురోజులు కావొస్తున్నా ఇక్కడ టిప్‌టాప్ పందిరి, దాని కింద రెండు టేబుళ్ళు, ఎస్.ఎస్.టి టీమ్ ఫ్లెక్సీ తప్ప పోలీస్, రెవెన్యూ అధికారులెవరు కనిపించడం లేదు. చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా అధికారులు లేకపోవడం గమనార్హం.

ఇదో కొత్త చిక్కు..

- వలంటీర్ల కట్టడిలో ఇబ్బందులు

ముదినేపల్లి, మార్చి 21 : ఎన్నికల ప్రచారంలో గ్రామ వలంటీర్లు పాల్గొనే సందర్భాలను గుర్తించడం అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచడం తేలిగ్గా అమలు చేసే అంశమే అయినా రాజకీయ నాయకుల ప్రచారంలో వారు పాల్గొంటున్నారా..? లేదా..? అన్నది కనిపెట్టి వారిపై చర్యలు తీసుకోవడం కత్తి మీద సాములా ఉంది. గతంలో ఏనాడు లేని విధంగా ఇదో కొత్త సమస్య అధికారులకు ఎదురైంది. వలంటీర్లు అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపణలు చేస్తుండడం, అందుకు తగ్గట్టుగానే వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ పలువురు వలంటీర్లను విధుల నుంచి తొలగించిన నేపథ్యంలో ముదినేపల్లి మండలంలోను అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టారు. తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు మండలంలోని వలంటీర్ల సమాచారాన్ని గ్రామస్థాయి అధికారుల నుంచి ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కూడా వలంటీర్ల పాత్ర పైనే దృష్టి పెట్టడంతో మండల స్థాయి ఎన్నికల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. సాధారణ ఎన్నికల విధులు ఒక ఎత్తయితే ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొనకుండా కట్టడి చేయడం మరో ఎత్తైంది.



మనోహర్, కరాటంతో బొరగం చర్చలు

కొయ్యలగూడెం, మార్చి 21 : పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా తనకు, లేదా జనసేన కన్వీనర్ చిర్రి బాలరాజుకు కేటాయించాలని టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ కోరారు. జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, బొరగం, నియోజకవర్గ వివిధ మండలాల టీడీపీ అధ్యక్షులు, ముఖ్య నేతలు కలిశారు. కూటమిలో భాగంగా పోలవరం నియోజక వర్గ టికెట్‌ను తనకు లేదా జనసేన ఇన్‌చార్జ్ బాలరాజుకు కేటాయిస్తే, తామంతా ఐకమత్యంతో విజయానికి కృషి చేస్తామని వివరించారు. ఈ విషయమై సీనియర్ నేత కరాటం రాంబాబును కలిసి చర్చించాలని మనోహర్ సూచించారు. బొరగం సహా నాయకులు బుట్టాయిగూడెం వచ్చి రాంబాబును కలిశారు. పోలవరం టిక్కెట్ కేటాయింపుపై ఆయనతో చర్చించారు. వారిద్దరూ సానుకూలంగా స్పందించినట్టు నియోజకవర్గ నేతలు తెలిపారు. టీడీపీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, రామారావు, ముగపర్తి సోముబాబు, పరిమి రాంబాబు, యంద్రప్రగడ శ్రీనివాస్, గద్దే అబ్బులు, అశోక్, నాగు, బొడ్డు కృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


కలువ బోనాలు ఊరేగింపులో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి


ప్రభ ఊరేగింపు

పెద్దింటమ్మ ప్రభల ఊరేగింపు

కైకలూరు, మార్చి 21 : కొల్లేటికోటలో పెద్దింటమ్మగా పిలవబడే జలదుర్గమ్మ, గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి తిలకించేందుకు భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉదయం పందిరిపల్లిగూడెం గ్రామస్థులు ఏర్పాటుచేసిన భారీ ప్రభ ఊరేగింపులో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభ ఊరేగింపులో ఆయన ట్రాక్టర్ నడిపారు. భక్తులతో రోడ్లన్నీ కిక్కిరిశాయి. పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు, గోకర్ణపురం, పైడిచింతపాడు గ్రామాల నుంచి వందలాది మహిళలు కలువ బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. మాజీ మంత్రి కామినేని, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి దంపతులు అమ్మవారికి, ప్రభకు పూజలు చేశారు. గోకర్ణపురం నుంచి కొల్లేటికోటకు గోకర్ణేశ్వరస్వామిని మేళతాళాలు, తీన్‌మార్ డప్పులతో పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కల్యాణోత్సవంలో 40 వేల మంది పైబడి భక్తులు పాల్గొన్నారు. రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవో కె.వి.గోపాలరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, నాని, రామచంద్రరావు, ఏసురాజు, పెన్మెత్స త్రినాథ రాజు, పేరిచర్ల ప్రసాద రాజు, వర ప్రసాద్, లక్ష్మి, పందిరిపల్లిగూడెం సర్పంచ్ వెంకటరమణ, సముద్రుడు, తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో గరగ డప్పులతో నృత్యం చేస్తున్న కళాకారులు

వైద్య ఉద్యోగుల ఆకస్మిక బదిలీలపై ఎన్‌హెచ్‌ఎం జేఏసీ అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 21 : ఏలూరు నగరంలోని ఓ అర్బన్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న 14 మంది నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు ఉద్యోగులను మూకుమ్మడిగా వివిధ పీహెచ్‌సీలకు ఆకస్మిక బదిలీలు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఏపీ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డి.దయామణి, కోశాధికారి జె.సింహాచలం ఓ ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు పంపిన ఫిర్యాదును ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అర్బన్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అత్యవసరంగా ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా నగరంలోని ఇతర యూపీహెచ్‌సీలతోపాటు, 50 కిలోమీటర్ల దూరంలోవున్న చింతలపూడికి బదిలీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గత 14 ఏళ్లుగా ఉద్యోగంలో చేరినచోటే విధులు నిర్వర్తిస్తున్న వేలాదిమంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పరస్పర బదిలీలకోసం జేఏసీ రెండేళ్లుగా అభ్యర్థిస్తున్నప్పటికీ ఇంతవరకు కార్యరూపమివ్వని అధికారులు ఆకస్మిక బదిలీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బదిలీలు, డిప్యూటేషన్లు లేవని చెబుతున్న అధికారులు ఏవిధంగా 14 మందిని బదిలీ చేశారని ప్రశ్నించారు. ఇదే విషయమై డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలను వివరణ కోరగా ప్రజాసేవల సౌకర్యార్థమే మార్చినట్టు వివరించాయి. కాగా కొందరు బదిలీ ఉత్తర్వులను స్వీకరించకుండా న్యాయ స్థానాన్ని ఆశ్రయించినట్టు సమాచారం.

అమ్మో.. బంగారం

- రికార్డు స్థాయిలో పెరిగిన ధర
- గ్రాముకు బిస్కెట్ 6,880.. ఆర్నమెంట్ 6,300

నరసాపురం, మార్చి 21 : బంగారం ధర పరుగులు తీస్తోంది. గురువారం ఒక్కసారిగా గ్రాముకు రూ.110 పెరగడంతో బిస్కెట్ బంగారం రూ.6,880కు చేరి ఆల్ టైం రికార్డు బద్దలుకొట్టింది. ఇక కాసు బంగారం (8 గ్రాములు) 55,040 పలుకుతోంది. 22 క్యారెట్ల ఆర్నమెంట్ బంగారం గ్రాము రూ.6,300కు చేరి కాసు రూ.50,400 పలికింది. ఇది బులియన్ మార్కెట్ చరిత్రలో రికార్డు ధర. అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాలే ధర పెరుగుదలకు కారణ మని చెబుతున్నారు. వెండి కేజీకి రూ.1000 పెరిగి రూ.77,500కు చేరింది. నెల రోజులుగా ధర పెరు గుదలను చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజ లు పసిడి కొనాలంటే ఆలోచించే పరిస్థితి. కొవి డ్‌కు ముందు గ్రాము ఆర్నమెంట్ బంగారం రూ.3,200. అంటే కాసు రూ.25,600. మూడేళ్ళలో ధర రెట్టింపైంది.

ఏటిగట్టు తవ్వి.. వదిలేశారు!



పాత పట్టిసీమలో, నూతన ఫెర్రీ రేవులో ఏటిగట్టు తవ్విన దృశ్యాలు

పోలవరం, మార్చి 21 : పట్టిసీమ మహాశివ రాత్రి ఉత్సవాల సమయంలో తమ అవసరాల నిమిత్తం పట్టిసీమ పరిసర ప్రాంతాల్లో ఏటిగట్టుకి ఆరుచోట్ల కాంట్రాక్టర్లు తూట్లు పెట్టారు. అయితే ఉత్సవాల అనంతరం గండ్లు పూడ్చకపోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలకు గోదావరి నది దాటి రాకపోకలు సాగించడానికి నూతనంగా ఏర్పాటు చేసిన ఫెర్రీ రేవు కోసం కన్నాపురం అడ్డరోడ్డు సమీపంలో రెండు చోట్ల ఏటిగట్టుకి గండ్లు కొట్టారు. సత్యసాయి మంచినీటి సరఫరా పథకం సమీపంలో రెండు చోట్ల, పట్టిసీమ కొవ్వా డ కాల్వ ఔట్ ఫాల్ స్లూయిజ్ సమీపంలో మరో రెండు చోట్ల గండి కొట్టారు. మహాశివరాత్రి ఉత్సవాల అనంతరం వెంటనే ఆ గండ్లను పూడ్చి వేయాలని అధికారులు ముందుగానే సూచించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లు, పంచాయతీ అధికారులు కాలయాపన చేయడం వల్ల ఏటిగట్టు బలహీన పడి రానున్న వర్షాకాలం సీజనులో ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలున్నాయని అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని అయా గ్రామస్థులు కోరుతున్నారు.





ఫేక్ కాల్ లెటర్

ఏపీ నిట్‌లో ఉద్యోగాలంటూ వల

లక్షల్లో వసూలు.. అధికార పార్టీ నాయకుడి మోసం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21: ఏపీ నిట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు లక్షల్లో దండుకున్నాడు అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు. మాటలతో పనికావడం లేదని ఆ మాయగాడు అపాయింట్‌మెంట్ లెటర్లతో బురిడీ కొట్టించాడు. గతంలో ఇదే తరహాలో నిట్‌లో, సచివాలయాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ నమ్మబలికి చాలామంది దగ్గర సొమ్ములు కాజేసిన ఘటనలు వెలుగులోకి వచ్చినా మళ్లీ అదే వ్యక్తి కొత్త కథలు వినిపిస్తూ మరికొంత మంది దగ్గర డబ్బులు స్వాహా చేశాడు. గతంలో సొమ్ములు ముట్టచెప్పిన వారితో పాటు మరికొంత మంది కొత్తవారితో ఏపీ నిట్ పేరుతో కాల్‌లెటర్లు పంపించి నిరుద్యోగుల నుంచి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకూ దండుకున్నాడు. కొందరు అడిగినంత ఇచ్చి ఉద్యోగం కోసం ఎదురు చూస్తుంటే మరికొంత మంది కాల్ లెటర్‌ను నమ్మలేక కొంత మొత్తం అడ్వాన్స్‌లుగా చెల్లించినవారు ఉన్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

ఉద్యోగాల పేరుతో వల వేస్తున్న వ్యక్తి అధికార పార్టీ నేత చుట్టూ తిరుగుతూ క్రియాశీలంగా వ్యవహరించడంతో పలువురు నిరుద్యోగులు ఈజీగా సొమ్ములు ముట్టచెప్పారు. బాధితుల్లో కొందరు సదరు పార్టీ సానుభూతిపరులే కావడంతో వ్యవహారం మరింత జటిలంగా మారింది. సదరు వ్యక్తి పంపిన కాల్ లెటర్ తప్పుల తడకగా ఉండడంతో దొరికేశాడు..అంతా బాగానే మ్యానేజ్ చేసినా ఎంపికైన ఉద్యోగుల లిస్ట్ మాత్రం 2024 నవంబరు నెలలో రిలీజ్ చేసినట్టు వచ్చింది. దీంతో ఆ వ్యక్తి అసలు బండారం బయటపడింది. దీంతో కొందరు నిరుద్యోగులు అతనిపై తిరగబడితే తాను నిమిత్త మాత్రుడినని తనను కొందరు అధికార పార్టీ నేతలు వాడుకుంటున్నారని చెప్పడం కొసమెరుపు.

నిట్‌లో ఎలాంటి రిక్రూట్‌మెంట్ జరగలేదు

ఏపీ నిట్‌లో గత ఆరు నెలలుగా ఎలాంటి రిక్రూట్‌మెంట్ జరగలేదని ఒకవేళ ఉద్యోగాల భర్తీ జరిగితే నోటిఫికేషన్ ఇచ్చి అంతా నిష్పక్షపాతంగా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తెలిపారు. నిరుద్యోగులు ఎవరూ ఇలాంటివి నమ్మవద్దని మెరిట్ ప్రకారం ఉద్యోగాల ఎంపిక ఉంటుందన్నారు.

జల సంక్షోభం..స్వయంకృతం..

పెరుగుతున్న జల కాలుష్యం

పచ్చని జిల్లాలో పెరుగుతున్న రోగులు

చుట్టూ నీరున్నా తాగే నీటికోసమూ కటకటే !



వేల సంవత్సరాల క్రితం నదీ జలాలు ఉన్నచోటే నాగరికత వర్ధిల్లిందనేది మనం చరిత్ర ద్వారా తెలుసుకున్నాం. ఇప్పుడు నాగరికత పెరిగిన చోటే నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తున్నది. మహా నగరాల నుంచి పల్లెల వరకూ తాగ నీటి సంక్షోభం ఎదుర్కుంటున్నాం. ఈ దుస్థితికి కారణాలేమిటి? బాధ్యులు ఎవరు? పర్యావరణం పాడైపోవడం కారణం అని చెప్పనక్కర్లేదు.. ఇలాంటి పరిస్థితుల్లో జీవ జలాన్ని రక్షించుకోవాలి. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కథనం.

భీమవరం, మార్చి 21 :భూగర్భ జలాలను మన అవసరాలకు మించి అదుపు తప్పి వినియోగించడం కారణంగా జల సంక్షోభం తలెత్తింది. ఏటా వర్షపాతం నమోదైన అంచనాలకు అనుగుణంగా జలాలను మాత్రమే వినియోగించుకోవాలి. కానీ దీనికి మించి నాలుగైదు రెట్లు భూగర్భ జలాలు వాడడం వల్ల ఇప్పుడు మనదేశంలోనే వెయ్యి నుంచి 1400 అడుగులకు నీటిమట్టం వెళ్లిపోయింది. మరోవైపు మన స్వయంకృతాపరాధం వల్ల జల కాలుష్యం దీనికి తోడైంది. దీంతో భూమిపై ఎగువన జల కాలుష్యం, భూమి అడుగున అడుగను అడుగంటిన భూగర్భ జలాలు.. ఫలితమే ఇప్పుడు జల సంక్షోభం.. తాగడానికి కూడా నీరు దొరకని పరిస్థితి దాపురించింది.

వరి అధికోత్పత్తికి ఎరువులు, పురుగుమందుల రసాయనాలతో భూ కాలుష్యం తీవ్రమైపోయింది పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాల్లో ఉండే గాఢ రసాయనాలు, భారీ లోహాలు భూసారాన్ని తగ్గించడంతో పాటు జలాన్ని కలుషితంగా మార్చేస్తున్నాయి. చేపలు, రొయ్యల చెరువులు కారణంగా ఉపరితల, భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయి. పెట్రోల్ వాడకం పెరగడంతో నైట్రోజన్ ఆక్సైడ్ ఉత్పన్నం కావడంతో ఆమ్లత్వం పెరిగి మట్టి స్వభావం కూడా మారిపోయి పైన ప్రవహించే నీరు కాస్తా విషంగా మారిపోతుంది. కొంతకాలం కిందట ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఏలూరులో ప్రజలను పరుగులు పెట్టించిన వింతరోగానికి జల,వాయు కాలుష్యమే కారణమని పలు సంస్థలు పేర్కొన్నాయి. జిల్లాలలో ఓ పక్క వరిసాగు, ఇంకోపక్క 8 పీపీటీ ఉప్పునీటి శాతంతో ఆక్వా సాగు ఫలితంగా ఉత్పత్తి అయ్యే ఉప్పునీటి వల్ల తాగునీటికి కూడా ముప్పు ఏర్పడింది. తాగునీటి కాలుష్యంతో ఆటో ఇమ్యూన్ డీసీజెస్ బారిన పడుతున్నాడు, గ్యాస్, అల్సర్, కిడ్నీ, కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. 2012లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చేసిన సర్వేలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 27 శాతం రోగులు ఇక్కడే ఉన్నట్టు సర్వే తేలింది. ఈ పదేళ్లలో రోగుల సంఖ్య మరింత పెరిగింది. ఈ పరిస్థితికి జల కాలుష్యమే కారణమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి విజ్జేశ్వరం లాకుల నుంచి జిల్లాకు ప్రత్యేక పైప్లైన్ ద్వారా గ్రామాలకు మంచినీటి సరఫరా అందించే 4500 కోట్లు ప్రాజెక్టు పెండింగ్లో పడిపోయింది. గత ప్రభుత్వ హయాంలో యనమదుర్రు కాలుష్యం నివారణకు 100 కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టును కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉప్పుటేరుపై రెండు చోట్ల 600 కోట్లతో ప్రతిపాదించిన రెగ్యులేటర్ నిర్మాణం ప్రాజెక్టు కూడా ముందుకు సాగలేదు. వీటివల్ల తాగునీరు అందుతూ జల కాలుష్యం నివారణ సాధ్య పడుతుంది.

ఉప్పుటేరు,కొల్లేరు కాలుష్యాన్ని నివారించాలి

డాక్టర్ పీఏ రామకృష్ణంరాజు, జల వనరుల శాస్త్రవేత్త



జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం, జల కాలుష్యం నివారణ కోసం ప్రధానంగా రాజమండ్రి-ధవళేశ్వరం మధ్య ఉన్న గోదావరి నది ప్రాంతాన్ని ఒక రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసినీటిని ప్రత్యేక పైపులైన్లు ద్వారా గోదావరి జిల్లాలకు తరలించాలి. దీనివల్ల ప్రజలకు తాగునీటి సమస్య చాలా పరిష్కారం అవుతుంది. గోదావరి కృష్ణ డెల్టాల మధ్య ఉన్న కొల్లేరు 300 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో ఉంది. దీనిలో ఉప్పునీటి కాలుష్యాన్ని నివారించాలి. పోలవరం కుడి కాల్వ నుంచి ఎగువన కొల్లేరులోకి తమ్మిలేరు, రామిలేరు మీదుగా మార్చి,ఏప్రిల్ నెలలో నీరు విడుదల చేస్తే కొల్లేరు పరిసరాల్లో 200 గ్రామాలకు తాగునీరు అంది పర్యావరణ కాలుష్యం నివారించబడుతుంది.

పండుగప్ప చేపల చెరువులో విష ప్రయోగం



మొగల్తూరు, మార్చి 21: మొగల్తూరు పంచాయతీ పరిధి ఇంజేటివారిపాలెంలో పండుగప్ప చేపల సాగు చేస్తున్న చెరువుపై విషప్రయోగం చేశారని రైతు ఇంజేటి దానం ఆరోపించారు. తాను సాగు చేసకుంటన్న 80 సెంట్లు చెరువులో రూ.1.50 లక్షల వ్యయంతో పండుగప్ప చేప పిల్లలు వేశానని వీటిని పెంచేందుకు ఇప్పటి వరకూ రూ.1.30 లక్షల వ్యయం చేశానన్నారు. బుధవారం రాత్రి సమయంలో తమపై కక్షపూరితంగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు విషప్రయోగం చేశారని దీంతో చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. గురువారం చెరువులో తేలియాడుతున్న చేపలను భీమవరం ల్యాబ్‌కు పంపగా విషప్రయోగంతో చేపలు మృతి చెందాయని తెలిపారు. దీంతో అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వివరించారు.



21-03-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం	గరిష్టం	కనిష్టం	సరాసరి
దేవరపల్లి	240	236	239.80
జంగారెడ్డిగూడెం-1	240	235	239.60
జంగారెడ్డిగూడెం-2	240	235	239.54
కొయ్యలగూడెం	240	235	239.72
గోపాలపురం	240	237	239.88

చేలు బీళ్లు..రైతు కన్నీళ్లు..



మొగల్లులో నెర్రలు తీసిన పొలం

వేల వరకూ అదనంగా పెట్టుబడి పెట్టారు. (caption continues in text)

పొలాలకు సాగునీరు అందక రైతులకు కంటి మీద కునుకు కరువైంది. కాలువ ఎప్పుడు వస్తుందా.. పంట పొలాలకు నీరు పెట్టుకుందామా అని రేయింబవళ్లు పంట పొలాల చుట్టూ తిరుగుతున్నారు. పొట్ట దశలో ఉన్న పొలాలకు నీరందక నెర్రలు తీస్తున్నాయి..

శివారుకు చేరని వంతుల వారీ నీరు

నీరందక నెర్రలు తీస్తున్న వరిచేలు

పాలకోడేరు, మార్చి 21 : మొగల్లులో గుత్తులవారి పాలెంకు వెళ్ళే ఊరకోడు డొడ్డితో పాటు వేంద్ర రహదారిలో ఉన్న పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. పొట్ట దశలో ఉన్న తరుణంలో సాగునీరు లేక పంట పొలాలన్నీ నెర్రలు తీసి ఉన్నాయి. ఇంజన్ల సహాయంతో, కారెంలతో నీటిని తోడుకుంటున్నారు. ఇప్పటికే ఎకరానికి పాతిక వేలు పెట్టామని ఇప్పుడు నీరు కోసం ఎకరానికి వచ్చి ఐదారు వేల రూపాయిలు ఖర్చు పెడుతున్నామని ఆ ప్రాంత రైతులైన సైదు నారాయణ, గుత్తుల శ్రీనివాస



ఆచంటలో పంట బోదిలో నీటిని తోడుతున్న దృశ్యం

రావు, గుత్తుల పెంటయ్య, రాయపూడి గంగాధర్, మందులు వాపోతున్నారు. సాగునీరు లేకపోవడంతో ఓవైపు ఎలుకల దాడి, మరోవైపు దోమ పోటుతో మరింత ఇబ్బందిగా మారిందని ఆ ప్రాంత రైతులు అంటున్నారు.

తక్షణమే సాగునీరు అందించాలి

మొగల్లు గ్రామంలోని దక్షిణం కాలువ నుంచి వచ్చే పంట పొలాలు తక్షణమే సాగునీరు అందించాలి. వంతులవారీలో సాగునీరందిస్తున్నా సరిపోవడం లేదు. దక్షిణ కాలువలో అడుగు మేర మాత్రమే సాగునీరు పారడంతో పొలాలకు వెళ్లే దారిలేకుండా పోయింది. సాగునీరు అందాలంటే ఇంజన్లు వేయాల్సిందే.గ్రామంలో చాలా దారుణ పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు తక్షణం స్పందించి రైతులకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



సైదు నారాయణ, గుత్తుల శ్రీనివాసరావు, గంగాధర్, పెంటయ్య (మొగల్లు రైతులు)

ఇంజన్ల సాయంతో నీరు

ఆచంట : వంతులవారీ విధానంతో సాగు నీటి కష్టాలు మరింత పెరిగాయి. మండలంలో శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో పంట బోదెల్లో ఉన్న నీటిని ఇంజన్ల సాయంతో చేలకు పెడుతున్నారు. ప్రస్తుతం పంట పొలాలు పొట్ట దశలో ఉన్న కారణంగా ఇపుడే నీటి అవసరం ఎక్కువని అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

చేలు ఎండిపోతున్నాయి

వీరవాసరం :పొట్టదశకు వస్తున్న వరిచేలకు సాగునీరు అందక ఎండిపోయిన స్థితికి చేరుతున్నాయి. క్రమం తప్పకుండా ఇవ్వవలసిన వంతు ఇవ్వకపోవటం వలన పీర్లకోడు కాలువ ఆయుకట్టు భూముకు నీరు అందడం లేదు. వీరవాసరం-మత్స్యపురి రహదారికి అటూ ఇటూ వీరవాసరం పరిధిలో సుమారు 100 ఎకరాలకు పీర్లకోడు ద్వారా సాగునీరు అందుతుంది. మూడునెలల్లో మూడు సార్లు కూడా ఈ ఆయుకట్టు భూములకు వంతుల్లో నీరు అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే మూడు కోటాల మందు వేశామని దాని ఫలితం కూడా పంటపై కనపడటం లేదని అంటున్నారు చేలల్లో నీరు లేకపోవడంతో కలుపు విపరీతంగా పెరుగుతుంది. ఈ కలుపు తొలగించటానికి రైతులు ఎకరాకు మూడు వేల వరకూ అదనంగా పెట్టుబడి పెట్టారు. పంటబోదుల్లో వచ్చే నీటిని ఇంజన్ల ద్వారా , కారెంల ద్వారా తోడుతున్నారు. అరకొరగా నీటితో చేలను కాపాడుతున్నారు. నెలలో ప్రతి పదిరోజులకు వంతు వచ్చేదని, జనవరి నెల నుంచి ఇప్పటి వరకూ మూడుసార్లు మాత్రమే వంతు వచ్చిందన్నారు. నీరు ఇప్పించాలని బుధవారం పీర్లకోడు పంటకాలువకు చెందిన పలువురు రైతులు జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.



వీరవాసరంలో ఎండిన చేను చూపిస్తున్న రైతు




గొల్లగూడెంలో ఓ ఇంటిపై వైసీపీ జెండా.. జగన్ ఫ్లెక్సీ



కైకరం వద్ద చెట్లకు వైసీపీ రంగులు





పెరుగుగూడెం వద్ద బోర్డు.. ఏలూరు మెడికల్ కాలేజీలో పోస్టరు

కళ్లు తెరిచి చూడండి

ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి ఐదు రోజులవుతున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు. కోడ్ అమలు చేయాలన్న బాధ్యతను విస్మరిస్తున్నారు. ఇంకా రాజకీయ నేతల హోర్డింగ్స్, ఫ్లెక్సీలు దర్శనమిస్తూనే ఉన్నాయి.

ద్వారకాతిరుమల, మార్చి 21: మండలంలోని గొల్లగూడెం పంచాయితీ పరిధిలోని పలు ఇళ్లపై వైసీపీ జెండాలు ఎగురుతున్నాయి అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు రహదారుల పక్కనే కన్పిస్తున్నాయి. అవి ఓటర్లను ప్రభావితం చేసేలా ఉండటంతో అధికారుల తీరుపట్ల ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఎలక్షన్ కమిషన్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తామని అంటున్నారు.

డ్వాక్రా వీవోఏకు షోకాజ్ నోటీసు

ఎన్నికల నిబంధలకు విరుద్ధంగా వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మండలంలోని మెట్టపంగిడిగూడెం డ్వాక్రా వీవోఏ కొప్పిశెట్టి వెంకటేశ్వరమ్మకు వెలుగు ఏపీఎం అరవింద షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈనెల 17న హోంమంత్రి వనిత నేతృత్వంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వెంకటేశ్వరమ్మ మైకు తీసుకుని వైసీపీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు మీరంతా సిద్ధమా...సిద్ధమా.. అంటూ కార్యకర్తలను ఉత్సాహపరచింది.

కోడ్ మెడికల్ కాలేజీకి వర్తించదా ?

ఏలూరు క్రైం : ఎన్నికల కోడ్ దేశవ్యాప్తంగా కోడై కూస్తున్నా ఇంకా కొంత మంది అధికారులు తమకు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విధమైన పోస్టర్లే దర్శనమిస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ ఫోటోతో ఉన్న పోస్టర్స్ పిల్లర్స్‌కు ప్రధాన ద్వారం వద్దే అందరికి కనిపించే విధంగా అంటించి ఉంచారు. ఎన్నికల కోడ్ మెడికల్ కాలేజీకి వర్తించదా అని విమర్శలు వస్తున్నాయి.

వీధిలైట్లకు వైసీపీ వెలుగులు తొలగాయి



ఏలూరు రూరల్ : ఆంధ్రజ్యోతి కథనంపై అధికారులు స్పందించారు. ఏలూరు నగరంలో పలుచోట్ల వైసీపీకి చెందిన పార్టీ ఫ్లెక్సీలు, ఏలూరు మున్సిపల్ పరిధిలో వీధిలైట్లకు వైసీపీ రంగులతో కూడిన విద్యుత్‌దీపాలపై కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి బుధవారం విద్యుత్ అలంకరణలు, పలుచోట్ల జగనన్న ఫ్లెక్సీలు, బొమ్మలను తొలగించారు.



వీరవాసరంలో తనిఖీ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

వాహనాల తనిఖీ..2.50 లక్షలు స్వాధీనం

వీరవాసరం/ ఆచంట మార్చి 21: జాతీయ రహదారి 165పై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గురువారం తనిఖీ నిర్వహించింది. వీరవాసరంలోని డివైన్‌మెర్సీ స్కూల్ సమీపంలో ఒక కారును తనిఖీ చేసి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.చించినాడకు చెందిన రేవూరి రాజేంద్ర ప్రసాద్ తన కారులో భీమవరం వెళుతుండగా నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో తనిఖీ అధికారులు రూ. లక్ష స్వాధీనం చేసుకున్నారు. వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ అనంతరం నగదును జప్తు చేశారు.

సిద్ధాంతం వద్ద రూ. లక్షా 51 వేల 990 రూపాయలు సీజ్

గురువారం సిద్ధాంతంలో లక్షా 51 వేల 990 రూపాయలు నగదును అధికారులు సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి స్వామినాయుడు తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పెనుమంత్రలోని ఇద్దరు, పెనుగొండలో ఒకరికి షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఆర్వో స్వామి నాయుడు తెలిపారు.

అధికారులకు కనిపించని అధికార పార్టీ బోర్డులు

దెందులూరు/ ఉంగుటూరు : దెందులూరు నియో జకవర్గంలోని పెరుగుగూడెం -పంగిడి గూడెం పరిధిలో అధికార పార్టీకి చెందిన బోర్డులు రోడ్డు పక్కనే ఉన్నా అధికారులు పట్టించు కోవడం లేదు. కోడ్ అమలు పక్కాగా జరుగుతోందని అధికారులు చెబుతున్నప్పటికి వైసీపీకి చెందిన బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. ఉంగుటూరు మండలం కైకరం వద్ద పాత సోమా కంపెనీ ఖాళీ స్థలంలో ఇటీవల వైసీపీ బస్సు యాత్ర జరిపిన సమయంలో చెట్లకు రంగులు వేసినా నేటికి తొలగించలేదు. హైవే పక్కనే కనిపిస్తున్నా కైకరం పంచాయతీ సిబ్బంది మౌనం ఎందుకో..?



టీడీపీలో చేరిన వలంటీరు, వైసీపీ కార్యకర్తలతో బడేటి చంటి

టీడీపీలో చేరిన వలంటీరు

ఏలూరు టూటౌన్, మార్చి 21: ఇటీవల టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు ప్రారంభమ్యాయి. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర పదవుల్లో ఉన్న వారంతా టీడీపీలోకి వలస వస్తున్నారు. అదే కోవలో వలంటీర్లు కూడా టీడీపీ వైపు క్యూకడుతున్నారు. 1వ డివిజన్‌కు చెందిన వార్డు వలంటీర్ పీ.రాజేష్ తన అనుచరులతో గురువారం టీడీపీలో చేరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో చంటి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చంటి మాట్లాడుతూ వైసీపీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయనటానికి ఇప్పటి వరకు ఆ పార్టీకి సేవలు చేసిన వలంటీర్లు కూడా టీడీపీలోకి రావడమే నిదర్శనమన్నారు. మాజీ కార్పొరేటర్ పెరుమాళ్ల హేమ శశికళ, నగేష్ దంపతులు తమ అనుచరులతో పాటు టీడీపీలోకి వచ్చారు. చోడే వెంకటరత్నం, శివ ప్రసాద్, చోడే బాలు, కడలి రాజు, ఎం.ఏసు, పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ దాడులు..20 కేసులు నమోదు



ఏలూరు టూటౌన్, మార్చి 21: తూనికలు కొలతల శాఖ అధికారులు వ్యాపారస్థులపై దాడులు నిర్వహించి 20 కేసులు నమోదు చేశారు. జాయింట్ కంట్రోలర్ సుధాకర్ ఆధ్వర్యంలో డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్ టీమ్ దాడులు నిర్వహించింది. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, తాడేపల్లి, పట్టణాల్లో తనిఖీలు నిర్వహించి ముద్రలు లేని తూనికకు పరికరాలు వినియోగిస్తున్న వ్యాపారస్థులపై దాడులు నిర్వహించారు. రైతుబజార్లు, కూరగాయల మార్కెట్ వ్యాపారులపై 13 కేసులు, మార్కెట్‌యార్డులో, కమీషన్ ఏజెంట్లపై 8 కేసులు, ఎంఎల్ఎస్ పాయింట్లపై ఒక కేసు నమోదు చేశారు. తనికీల్లో కాకినాడ, ఏలూరుజోన్ అధికారులు ఎస్.జనార్ధనరావు, కే.రాజేష్, వీ.నాగ రాజారావు, శామ్యూల్‌రాజ్, షేక్ సలీం, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 21: తాడేపల్లిగూడెం మండలం జగన్నాధపురంలో లక్ష్మిగణపతి ఫెర్టి లైజర్స్ దుకాణంలో విజిలెన్స్ వ్యవ సాయశాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు, పురుగు మందులు సీజ్ చేశారు.విజిలెన్స్ అధికారి కరణం కుమారి మాట్లాడుతూ అక్రమంగా నిల్వ ఉంచిన రూ.26,544 విలువ గల 4.14 ఎరువులు సీజ్ చేయడంతో పాటు, సర్టిఫికెట్ లేని కంపెనీలకు సంబంధించిన 612 కేజీల పురు గుమందులు అమ్మకాలు నిలుపు దల చేసినట్టు వివరించారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్, విజిలెన్స్ ఎస్సై రంజీత్‌కుమార్, ఏవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాగు నీరు తాగి 17 గొర్రెలు మృతి

కుక్కునూరు, మార్చి 21 : మండల పరిధిలోని గుండేటివాగులోకి నీరు తాగడానికి వెళ్లి 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గోపాలపురానికి చెందిన రైతులు కొద్ది రోజులుగా కుక్కునూరు పరిసర ప్రాంతాల్లో గొర్రెలను మేపుతున్నారు. గురువారం పదుల సంఖ్యలో గొర్రెలు నీరు తాగడానికి వెళ్లాయి. అయితే ఆ నీరు తాగి వచ్చిన అనంతరం ఒక చోట కుప్పగా 17 గొర్రెలు ఒక దానిపై ఒకటి పడి మృతి చెంది ఉన్నాయి. వాగునీరులో విషపదార్థాలు కలసిన నీరు తాగి ఉండవచ్చు లేదంటే అవితీసుకున్న మేతలో పురుగుమందు కలసి ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు.

చేయూత డబ్బులు వేస్తామని... మహిళ ఖాతా నుంచి రూ.82 వేలు మాయం

కుక్కునూరు, మార్చి 21 : వైఎస్సార్ చేయూత డబ్బులు వేస్తామని చెప్పి ఒక మహిళ ఖాతా నుంచి రూ.82,697 కాజేశారు. బాధితురాలు పళ్లం సంధ్యారాణి తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం సాయంత్రం ఉప్పేరు గ్రామ వలంటీర్ ఎం.వెంకట్ బాధిత మహిళ తమ్ముడు పళ్లం నరేంద్రబాబుకు ఫోన్ చేసి వైఎస్సార్ చేయూత డబ్బులు రూ.18,500 మీ ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. సచివాలయ ఉద్యోగి ఫోన్ కాన్ఫరెన్స్‌లో కూడా ఉన్నాడని తెలిపాడు. ఫోన్‌పే నెంబరు చెబితే డబ్బులు ఎకౌంట్‌లో పడతాయని చెప్పాడు. నరేంద్రబాబుకు ఫోన్‌పే నెంబర్ లేకపోవడంతో సంధ్యారాణి నెంబర్ ఇచ్చాడు. సచివాలయం ఉద్యోగి అని చెప్పిన వ్యక్తి మాట్లాడుతూ మీ అకౌంట్‌లో రూ.18,500 జమయ్యాయి చూడమని చెప్పాడు. డబ్బులు జమ కాలేదని సంధ్యారాణి చెప్పగా మీ ఎకౌంట్ నంబరు మళ్లీ చెప్పాలని అడిగాడు. ఇలా చెబుతున్న క్రమంలోనే ఎకౌంట్ నుంచి పలు విడతలుగా మొత్తం రూ.82,697 కట్ అయ్యాయి. దీంతో సంధ్యారాణి వెంటనే వలంటీర్ వెంకట్‌ని నిలదీయగా సచివాలయ ఉద్యోగిగా ఫోన్ చేసిన వ్యక్తి తనకు కూడా పూర్తిగా తెలియదని ఫోన్‌నెంబర్ అడిగితే ఇచ్చా నని తెలిపారు. దీంతో ఆమె సైబర్ సెల్‌కు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హత్యాయత్నం కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 21 :ఇద్దరిపై చాకుతో దాడి చేసిన యువకునిపై ఏలూరు టూటౌన్ పోలీసులు ఎట్టకేలకు హత్యాయత్నం (ఐపీసీ 307) కింద కేసు నమోదు చేశారు. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన పాలడుగు చాణుక్య ఈనెల 19వ తేదీన తన ఇంటి వద్ద వడ్రంగి మేస్త్రి దుర్గాసురేష్ మిషన్‌తో వడ్రంగి పనులు చేస్తుండగా శబ్దం ఎక్కువగా వస్తుందని చాణుక్య గొడవ పడ్డాడు. మిషన్ శబ్దం అలాగే వస్తాదని సురేష్ చెప్పడంతో ఆగ్రహించిన చాణుక్య చాకు తెచ్చి సురేష్‌పై దాడి చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు హత్యాయత్న కేసు నమోదు చేయకుండా ఐపీసీ 324గా నమోదు చేశారు. స్టేషన్‌కు తీసుకువెళ్ళి అతనిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. 24 గంటలు గడవకముందే మరో వ్యక్తిపై కత్తితో దాడిచేశాడు. ఏలూరు శంకరమఠం వీధికి చెందిన కొత్త శేషాజీ పాత గ్యాస్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన కారులో వెళ్తుండగా ఏలూరు డీమార్టు శివాలయం వద్ద ఈనెల 20వ తేదీ ఉదయం కారుకు ఎదురుగా చాణ్యుక తన స్కూటర్‌తో రాంగ్‌రూటులో వచ్చాడు. దీంతో కార్‌డ్రైవర్ హారన్ కొట్టాడు.కారుకు స్కూటరు అడ్డుపెట్టి చాణక్య ఘర్షణకు దిగాడు. కారు దిగిన శేషాజీ మెడపై చాణక్య పొడవడానికి ప్రయత్నించగా ఆయన చేతులు అడ్డుపెట్టారు. చేతులపై గాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చినా సకాలంలో వాగ్మూలం నమోదు చేయలేదని తెలుస్తోంది. రెండో సంఘటన జరగగానే పోలీసులు చాణుక్యపై అప్పటికే వడ్రంగి మేస్త్రి ఇచ్చిన కేసును సెక్షన్ 324 నుంచి 326గా మార్చుచేసి 20వ తేదీ రాత్రి అరెస్టు చేశారు. గ్యాస్ కంపెనీ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాణుక్యపై హత్యా యత్నం కేసును గురువారం నమోదు చేశారు.ఒక ప్రజాప్రతినిధి ఒత్తిళ్ళతోనే పోలీసులు ఈ కేసు తారుమారు చేయడానికి ప్రయత్నించారని విమర్శలు వస్తున్నాయి.

సారా బట్టీలపై దాడులు

13 కేసులు నమోదు ..10 మంది అరెస్టు



ఏలూరు క్రైం, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సారా పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆదేశాలతో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ వారి సిబ్బంది కలిసి గురువారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 స్థావరాలపై దాడులు చేసి 13 కేసులునమోదు చేసి 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 85 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 3050 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్ 130, అక్రమంగా నిల్వ ఉంచిన మరో 13 మద్యం బాటిల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

నలుగురి అరెస్టు ..రూ.67,950,11 మోటారు సైకిళ్ళు స్వాధీనం



ఏలూరు క్రైం,మార్చి 21 : ఎన్నికల వేళ పోలీసులంతా విధుల్లో బిజీగా నిమగ్నమై ఉంటారని మనవైపు కన్నెత్తి చూడరంటూ పేకాట నిర్వా హకులు ఎక్కడికక్కడే పేకాట స్థావరాలను పెట్టేస్తున్నారు. పెదవేగి మండలంలోని వేగివాడ గ్రామం నందికొట్కూరు, ఊటచెరువు గట్టుపై భారీ ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుల ఆదేశాలతో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి 67,950 రూపాయల నగదు, 11 మోటారు సైకిళ్ళు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని పెదవేగి పోలీసులకు అప్పగించారు.

లిఫ్ట్ ఇస్తానని చెప్పి దోపిడీలు

అరెస్టు చేసిన తణుకు పోలీసులు



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ మూర్తి

తణుకు, మార్చి 21 : లిఫ్ట్ ఇస్తానని చెప్పి మోటారు సైకిల్‌పై తీసుకుని వెళ్లి దోపిడీలకు పాల్పడుతున్న దొంగను తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోపవరం గ్రామానికి చెందిన ఆకుల రమేష్ వివిధ ప్రాంతాల్లో పలువురిని మోటారు సైకిల్ ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశాల్లో చాకు చూపించి వారి వద్దనున్న బంగారు వస్తువులు దొంగలించడం అలవాటుగా చేసుకున్నాడు. ఏలూరు పట్టణానికి చెందిన పల్లిపోతుల హరిమోహన్ పెళ్ళి సంబంధాలు చూస్తూ కమీషన్ తీసుకుని జీవిస్తున్నాడు. ఈనెల 18వ తేదీన ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామం వెళ్లేందుకు తణుకు బస్టాండ్‌లో చూస్తుండగా రమేష్ తాను పాలంగి వైపు వెళుతున్నాని, అక్కడ దించుతానని చెప్పి హరిమోహనరావును తన మోటారు సైకిల్ ఎక్కించుకున్నాడు. చీకటిగా ఉన్న ప్రదేశంలో ఆపి చాకు చూపించి మెడలో ఉన్న బంగారు గొలుసు, చేతి ఉంగరం ఇమ్మని బెదిరించాడు. మోహనరావు ప్రతిఘటించడంతో చేతికి గాయం అయినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారన్నారు. రూరల్ సీఐ నాగేశ్వరావు దర్యాప్తు చేపట్టారు. ఉంగుటూరులో నిందితుడిని అతని ఇంటివద్ద 19వ తేదీ సాయంత్రం అరెస్టు చేసినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు వివరించారు. దోపిడీలో ఉపయోగించిన చాకు, మోటారు సైకిల్, 24 గ్రాములు బంగారు గొలుసు రెండుతో పాటు మొత్తంగా 40 గ్రాముల బంగారు గొలుసులు (రూ.2.40 లక్షలు) స్వాధీనం చేసుకున్నామన్నారు.24 గంటల్లోనే ముద్దాయిని గుర్తించి అరెస్టు చేసిన సీఐ నాగేశ్వరరావు, సహకరించిన ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాసు, అన్వర్‌లను ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

లింగపాలెం, మార్చి 21: ములగలంపాడు గ్రామానికి చెందిన కటకం గోపాలకృష్ణ ప్రేమ విఫలమై పురుగుమందు తాగినట్లు తెలిపారు. యువకుడి స్నేహితులు, స్థానికులు గమనించి చింతలపూడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.

అడవికొలనులో ఇంటింటికి జనసేన



యువ ఓటర్లను కలసిన ధర్మరాజు

నిడమర్రు, మార్చి 21: అభివృద్ధి కోసం అందరం కలసి అడుగేద్దామని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. అడవికొలనులో గురువారం ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ధర్మరాజు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగా ఓటు పొందిన యువతను కలసి గెలిపించాలని కోరారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



అన్నప్రాసన నిర్వహిస్తున్న సీడీపీవో

ఏలూరు కార్పొరేషన్, మార్చి 21: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో ఎ.పద్మావతి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ, పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రసాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోషణపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మావతి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.జోషి, మహిళా సంరక్షణ అధికారి ఎం.మాధవి, ఆరోగ్య కార్యదర్శి వై.శ్రావణ సంధ్య, జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు సోషల్ మీడియాలో చిక్కుకోవద్దు



పురస్కారాన్ని అందజేస్తున్న దమయంతి

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 21: విద్యార్థులు సోషల్ మీడియాలో చిక్కుకోవద్దని, కెరీర్‌పై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి చేరాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి దమయంతి అన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం ఇంటర్న్‌షిప్ ముగింపును పురస్కరించుకుని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులకు, 2023-24 విద్యార్థి సంఘ కార్యవర్గానికి వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దమయంతి మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థినైన తనలాంటి వారెందరికో ఇక్కడి గురువుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. విద్యార్థినులు ఎక్కువగా సోషల్ మీడియా సమాచారంపై ఆధారపడుతున్నారని, ఇది పలు అనర్థాలకు దారితీస్తోందని హెచ్చరించారు. కళాశాల సుపీరియర్ సిస్టర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి నిజాయితీ, నిబద్ధతతో ప్రయత్నించాలన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థినులకు పురస్కారాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల, సిస్టర్ ఫాతిమా డిగాల్, రత్నమేరి పాల్గొన్నారు.

పాలి ప్రసాద్ సేవలు మరువలేనివి



ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఏలూరు టూటౌన్, మార్చి 21: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ సీనియర్ నేత పాలి ప్రసాద్ పార్టీ పటిష్టతకు చేసిన సేవలు మరువలేనివని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పాలిప్రసాద్ సంస్మరణ సభ గురువారం జరిగింది. పలువురు నేతలు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా క్రమశిక్షణ గల కార్యకర్తగా టీడీపీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కె.విశ్వనాథం, పుప్పాల జగదీష్‌బాబు, పట్నాల వెంకటేష్‌బాబు, కొక్కిరిగడ్డ జయరాజు పాకలపాటి గాంధీ, పెద్దిబోయిన శివప్రసాద్, కొల్లేపల్లి రాజు, కడియాల విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు, జంపా సూర్యనారాయణ, దాకారపు రాజేశ్వరరావు, మల్లేపు రాము పాల్గొన్నారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు సంతాప సందేశాలు పంపించారు.

బీజేపీ కూటమిని ఓడించండి



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

వేలేరుపాడు, మార్చి 21: దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో మతవాద బీజేపీ, ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యులైన ప్రాంతీయ పార్టీలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి పోటు రంగారావు, కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారుమాట్లాడారు. బీజేపీ మతోన్మాద రాజ్య స్థాపనకు పూనుకుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం గడచిన 9 ఏళ్లలో ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతుందన్నారు. కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను తన మిత్రులు అదాని, అంబానీలకు తెగ అమ్ముతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని మాటతప్పి చివరికి ప్రత్యేక ప్యాకేజీని ఇస్తానని చెప్పి కూడా ఇవ్వకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బీజేపీ, మిత్రపక్షాలకు ప్రజలే ఈఎన్నికల్లో బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్రనాయకులు ఎస్‌కె గౌస్, కెచ్చల కల్పన, సత్యనారాయణ, సిరికొండ రామారావు, జి.ముత్యాలరావు, కె.వీరాస్వామి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ బండ పేలి పూరిల్లు దగ్ధం

దెందులూరు, మార్చి 21: గ్యాస్ బండ పేలి పూరిల్లు దగ్ధం కావడంతో పాటు వివాహం కోసం దాచిన నగదు పూర్తిగా కాలిపోయింది. కొత్తగూడెం శివారు శింగగూడెం శివారులో గోదావరి కాల్వ గట్టు సమీపంలో సింగవరపు రవణమ్మ ఇంట్లో బుధవారం రాత్రి గ్యాస్ లీకైంది. గమనించని రమణమ్మ స్టౌ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ నెల 23న కొడుకు కుమార్తె పెళ్లి కావడంతో ఖర్చుల నిమిత్తం రూ.1.10 లక్షలు అప్పు తెచ్చి ఇంట్లో ఉంచారు. తాటాకిల్లుతో పాటు నగదు కూడా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మొత్తం కాలిపోయింది. మంటలు పక్క ఇళ్లకు వెళ్లకుండా వారు అదుపు చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు.

అంగన్వాడీ కేంద్రం మూత

ద్వారకాతిరుమల, మార్చి 21: వేంపాడులోని చవలవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రం కొన్నాళ్లగా మూతపడింది. 20 రోజులు నుంచి అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రానికి తాళాలు వేసి ఉంది. ఇక్కడి కార్యకర్త మహిళలను ఇబ్బందులు పెడుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. తమ పిల్లలను కేంద్రానికి పంపబోమని చెప్పారు. వైసీపీ నాయకుల అండతో అంగన్వాడీ కార్యకర్త విధులకు గైర్హాజరై కేంద్రాన్ని మూసివేస్తోందని ఆరోపించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ మేరీని వివరణ కోరగా ఆమె ఈనెల 1 నుంచి విధులకు గైర్హాజరైందని విచారణ జరిపి చర్యలు చేపడతామన్నారు.

ఏలూరు నగరంలో కలుషిత నీరు సరఫరా

ఏలూరు టూటౌన్, మార్చి 21: నగరపాలక సంస్థ కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తున్నట్లు నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. 1వ డివిజన్ నల్లదిబ్బ ప్రాంతంలో మూడు రోజులుగా కలుషితనీరు వస్తుందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కమిషనర్ వెంకటకృష్ణను వివరణ కోరగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని ఎక్కడైనా కలుషిత నీరు వస్తున్నట్టైతే అక్కడ స్వచ్ఛమైన నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మకు పాలభిషేకం



అభిషేకం చేస్తున్న భక్తులు

బుట్టాయగూడెం, మార్చి 21: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం విగ్రహంతోపాటు కలశాలు, యంత్రాలకు పాలభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, విశేష దుర్గా శూలిని యంత్రపూజ, హోమాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు, ఆలయ కమిటీ చైర్మన్ భౌమరాజు సత్యనారాయణరాజు సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి రథోత్సవం

నిడమర్రు, మార్చి 21: పెద నింద్రకొలను భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శివ నామస్మరణతో సాగిన రథోత్సవం లో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి తీర్థప్రసాదాలు సమర్పించారు. స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి జాడే లేదు

వైసీపీ పాలనతో విసిగి టీడీపీలో చేరిన కార్యకర్తలు



పార్టీలో చేరిన వారితో కలసి అభివాదం చేస్తున్న చింతమనేని



అంకాలంపాడులో టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఘంటా మురళి

పెదవేగి, మార్చి 21: వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందని, వైసీపీని ఇంటికి సాగనంపితేనే తిరిగి రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందని సీతారామపురం గ్రామస్తులు మద్రి వాసు, మల్లికార్జునరావు మూడెడ్ల రాంబాబు, ప్రదీప్ అన్నారు. చక్రాయగూడెం పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన వాసు, మల్లికార్జునరావు, రాంబాబు, ప్రదీప్, మిడతా సాయికుమార్, దాసరి శివ, మాచవరపు చంద్రశేఖర్ కుటుంబాలు వైసీపీని వీడి చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చింతమనేని ప్రభాకర్ వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఏదో చేస్తారని ఆనాడు వైసీపీకి అండగా నిలిచామన్నారు. ఐదేళ్లు గడుస్తున్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిందేమీ లేదని, దోచుకోవడం, దాచుకోవడంతోనే పబ్బం గడుపుకున్నారన్నారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుంటుందనే నమ్మకంతో టీడీపీలోకి వచ్చామని తెలిపారు. చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. బొప్పన సుధాకర్, మాదు రవికుమార్, దొర్రాజు శ్రీనివాసరాజు, కొనకళ్ళ కృష్ణ, గొర్రెల సుధాకర్, నరేంద్ర, బడుగు సత్యనారాయణ, మందిడి కేశవ, పెద్దిరెడ్డి సత్యనారాయణ, వెన్నెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- పెదపాడు : వైసీపీని వీడి టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొత్తూరు ఉప సర్పంచ్ తోలం వెంకటేశ్వరరావుతో కలసి సుమారు 35 కుటుంబాల వారు దుగ్గిరాలలో చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి చింతమనేని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొత్తూరు చినబాబు, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కామవరపుకోట : అంకాలంపాడు పంచాయతీ జలపావారిగూడెంకు చెందిన 70 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కరుటూరి మిథున్‌చక్రవర్తి, కరుటూరి బాలస్వామి తదితరులకు వారికి పార్టీ కండువాలు కప్పి మాజీ ఎమ్మెల్యే మురళీ ఆహ్వానించారు. తూతా లక్ష్మణరావు, కరిపోతు స్వామినాథం, అడ్డరోడ్డు శ్రీను, బొప్పన అంజయ్య బొప్పన శేఖర్, గూడపాటి కేశవరావు, వడ్లపట్ల నరసింహారావు, గరిమళ్ళ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు మేలు



శివపురంలో బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ బీసీ నాయకులు

చింతలపూడి, మార్చి 21: టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని బీసీ జిల్లా నాయకులు కుమ్మరాజు సత్యనారాయణ అన్నారు. చింతలపూడి మండలం శివపురం బీసీ కాలనీలో బీసీ డిక్లరేషన్‌పై అవగాహన కల్పిస్తూ గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. బీసీలు 50 ఏళ్లకే పింఛన్, రక్షణ చట్టం చేయనున్నట్టు తెలిపారు మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి, ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనంలో పిల్లలకు రూ.15 వేలు, రైతులకు రూ.20వేలు ఆర్థిక సహాయం ఉంటుందని వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు, బీసీలు ఐక్యంగా ఓటువేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చెరువుగట్టు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, చింతా విష్ణు, ఉలాస సుబ్బారావు, జిల్లా రైతుసంఘ టీడీపీ అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు, గ్రామ బీసీ నాయకులు పాల్గొన్నారు.



దెందులూరులో రాజకీయ నేతలతో మాట్లాడుతున్న జేసీ



ఏలూరులో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ముక్కంటి



దేవులపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న లింగపాలెం తహసీల్దార్

స్వేచ్ఛగా ఓటేయండి

ఓటర్లకు అధికారుల భరోసా

రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

దెందులూరు, మార్చి 21: ఓటర్లు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు చర్యలు చేపడుతున్నామని, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్, ఆర్వో బి.లావణ్యవేణి అన్నారు. నియోజకవర్గంలో రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల నియమావళిపై గురువారం సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారానికి ముద్రించే కరపత్రాలపై వివరాలు కూడా ముద్రించాలన్నారు. లేకుంటే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారం, ప్రకటనలలో కుల, మత, భాషాపరమైన అంశాలు, విద్వేషాలను రగిల్చే అంశాలు ఉండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, జనసేన. కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

- ఏలూరు రూరల్: రాజకీయపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో మోడల్ కోడ్‌పై గురువారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 200 పోలింగ్‌స్టేషన్‌ల పరిధిలో మోడల్‌కోడ్ అమల్లో ఉందన్నారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలన్నా అనుమతి తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు నిర్వహించేటప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వాలని, తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ముర్రర్తి, ఎస్‌ఐలు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రాజారెడ్డి, రవితేజ, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- లింగపాలెం: మండలంలో రాజకీయపార్టీల నాయకులతో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎస్సై పి.చెన్నారావు సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధి విధానాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించాలన్నారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలను పెట్టకూడదని ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. ఎన్నికల సిబ్బంది, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం: ఎన్నికల నియమావళిని పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ రాజేష్ అన్నారు. మండలంలోని దేవులపల్లిలో ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. లక్కవరం ఎస్‌ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.
- టి.నరసాపురం: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కర పాటించాలని డీఎల్‌పీవో ఎం.రజావుల్లా తెలిపారు. అప్పలరాజుగూడెం, బండివారిగూడెం తదితర గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవోపీఆర్డీ రాంప్రసాద్, కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న విద్యార్థులు

చింతలపూడి, మార్చి 21: అడవుల సంరక్షణ అందరి బాధ్యతని ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పీఎస్‌పీ స్వచ్ఛంద సంస్థ వ్యవసాయశాఖ భాగస్వామ్యంతో రాఘవాపురం హైస్కూల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హైస్కూల్ ఆవరణలో ఏవో కె.మీనాకుమారి మొక్కలు నాటారు. అడవుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యంతో జీవరాశి, మానవమనుగడ ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రకృతి దోహదపడుతుందన్నారు. కీర్తి, నరేష్ చౌదరి, కౌశిక్, హైస్కూల్ హెచ్‌ఎమ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

జంగారెడ్డిగూడెం, మార్చి 21 : ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ప్రసాద్ బాబు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో ఆంగ్ల సాహిత్యం, ఆంగ్ల భాషలో తాజా పోకడలు అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును గురువారం నిర్వహించారు. ఆంగ్ల విభాగాధిపతి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భాషా సామర్థ్యాలు ప్రపంచవ్యాప్తంగా అవసరం అన్నారు. ఇది విద్యార్థి దశ నుంచే నేర్చుకుంటే ఎంతో ఉపయోగమన్నారు. ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ రావు, స్పెషల్ ఆఫీసర్ కె.విజయబాబు, పంకజ్ కుమార్, ఎం.కార్మెల్ సోఫియా తదితరులు మాట్లాడుతూ భావితరాల భవిష్యత్‌కి ఉపాధికి ఆంగ్ల భాష నైపుణ్యం, సాహిత్యం ఎంతో దోహదపడతాయని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ ఎం.మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కామవరపుకోట, మార్చి 21 : ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.విజయబాబు మాట్లాడుతూ మనిషిని, మనస్సును కదిలింప చేసే శక్తి అక్షరాలకు ఉందన్నారు. సామాజిక పరివర్తనకు కవితలు ఎంతో దోహదపడతాయన్నారు. తెలుగు అధ్యాపకులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషిలో సృజనాత్మకత, నైతిక విలువలు కవితల ద్వారా పెంపొందుతాయన్నారు. అధ్యాపకులు దారావతు మల్లేష్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ప్రసాద్, రామారావు, సిబ్బంది జిల్లా పరిషత్ సెంటర్ వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని వారికి జరిమానాలు విధించారు. ఎస్‌ఐలు మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ఖచ్చితంగా వాహనానికి సంబంధించిన రికార్డులు, ఇన్సూరెన్సు, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.

కాళిదాసుకు విశిష్ట పురస్కారం

ఏలూరు కల్చరల్, మార్చి 21: ఏలూరు ఫైనార్ట్స్ అకాడమి గౌరవ అధ్యక్షుడు గరికపాటి ఆర్ట్స్ థియేటర్స్ అధినేత గరికపాటి కాళిదాసుకు విశిష్ట పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో బుర్రావెంకట సుబ్రహ్మణ్యం స్మారక కీర్తి పురస్కారాన్ని గురువారం ప్రకటించింది. విశ్వవిద్యాలయం కులపతి డి.కిషన్‌రావు, తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమి డైరెక్టర్ డా.ఎం.రాజేందర్ పురస్కారాన్ని అందజేశారు. సాహిత్యమండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం, సినీకళావిశారద ఎస్.వి రామారావు, ప్రముఖ కవి గురుశర్మ, పరిమి సావిత్రి తదితరులు హర్షం ప్రకటించారు.

- ఏలూరు ఎడ్యుకేషన్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి ఏలూరుకు చెందిన జీవీఎన్.రాజు ఎంపికయ్యారు. వ్యక్తిత్వ వికాసం విభాగంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, బీవీ.దాశరథి కీర్తి పురస్కారానికి ఎంపికైన రాజుకు ఎం.రాజేందర్, విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ టి.కిషన్‌రావు పురస్కారం అందజేశారు.

వీఆర్వో అశోక్‌పై దాడి దుర్మార్గం

ఏలూరు రూరల్, మార్చి 21: సత్యసాయి జిల్లా ధర్మవరం, లక్ష్మి చెన్నకేశవపురంలో ఓ ప్రభుత్వస్థలం కబ్జా విషయంపై ప్రశ్నించిన వీఆర్వో అశోక్ పై సాకే నరసింహులు అనేవ్యక్తి దాడిచేయటందుర్మార్గం అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగ్రామ రెవిన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. కొంతకాలంగా కొంతమంది రాజకీయ నాయకులు అధికార దాహంతో వారి ఇష్టానుసారం రాష్ట్రవ్యాప్తంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిని చితకబాదుతున్నారని, పోలీసులు, రెవిన్యూ, వీఆర్వోల పై జరిగే దాడులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్ళకు లొంగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అశోక్‌పై దాడిపై ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామని రవీంద్రరాజు స్పష్టం చేశారు.

భువనపల్లి పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

నిడమర్రు, మార్చి 21: విద్యార్థులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని డీఈవో అబ్రహం అన్నారు. భువనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఐఎఫ్‌బి ప్యానెల్ వాడకంపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. నోటుపుస్తకాలు దిద్దడం గురించి ఆరా తీశారు. పాఠశాలలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఎంఈవోలు కె.రాంబాబు, పి.శేషు, గణపవరం ఎంఈవో జి.బాలయ్య, హెచ్‌ఎం సంకు ఏసుబాబు పాల్గొన్నారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

లింగపాలెం, మార్చి 21:లింగపాలెం మండలం సింగగూడెంలో పీడీఎస్ రైస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సింగగూడెం గ్రామానికి చెందిన మండా రమేష్ పీడీఎస్ రైస్ అక్రమంగా నిల్వఉంచినట్టు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. 805 కేజీల సివిల్ సప్లై అధికారులకు అప్పచెప్పినట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

లింగపాలెం, మార్చి 21: కాటమరెడ్డిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయుడు లక్ష్మణుడు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యావనరుల కేంద్రంలో గురువారం జరిగిన సంతాప సభలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ నాయకునిగా, మంచి ఉపాధ్యాయునిగా పలు సేవలు నిర్వహించిన లక్ష్మణుడు మాస్టారు మృతి తీరని లోటు అన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు వారికి అనేక నీతికథలు నేర్పుతూ సత్యంవైపు నడిపించేలా వారిని తీర్చిదిద్దిన ఆదర్శమూర్తి లక్ష్మణుడు అని కొనియాడారు. లక్ష్మణుడు కుటుంబానికి ఉపాధ్యాయుల సంఘం ఎల్లప్పుడూ తోడు ఉంటుందని అన్నారు. సంతాప సభలో ఎంఈవోలు కె.రామారావు, జె.రవీంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు అధికారులకు ఉగాది పురస్కారాలు

ఏలూరు క్రైం, మార్చి 21: ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు, అగ్నిమాపక, పోలీస్ అనుబంధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి వివిధ పతకాలను ప్రకటించింది. ఈ పతకాలు పొందిన వారిలో జిల్లాకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. జిల్లా ఏఎస్పీగా పనిచేసి, ఎన్నికల నియమావళి బదిలీల్లో కాకినాడ ఏఎస్పీగా బదిలీ అయిన ఎంజెవి భాస్కరరావుకు ఉత్తమ సేవా పతకం ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు సమీపంలోని పెదవేగి డీటీసీలో ఎస్‌ఐగా పనిచేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయ పీఆర్వోగా పనిచేసిన ఎస్‌ఐ కేశవరావు (ఎస్‌ఐ 1008)కు, ఏలూరు త్రి టౌన్ ఏఎస్‌ఐ కె గోవిందరాజు(ఏఎస్‌ఐ 4)కు, పెదవేగి హెడ్‌కానిస్టేబుల్ పిఎస్‌వి ప్రవీణ్ (హెచ్‌సి 1719), ఏలూరు జిల్లా ఆర్మ్‌డు రిజర్వుడు విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కెఎస్ఎన్ మూర్తి (ఎఆర్‌హెచ్‌సి 1097)లకు సేవా పతకం ప్రభుత్వం ప్రకటించింది.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

పెదపాడు, మార్చి 21: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ సూచించారు. వేసవి జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో గురువారం సమీక్షించారు. బయటకు వెళ్లే సమయంలో తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యసాయం పొందాలని చక్రధర్ సూచించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూ టౌన్ :** స్వాతంత్య్రం పోరాటంలో అసువులు బాసిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ బాటలో నేటి యువత పయనించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కన్వీనర్ కె.వరప్రసాద్ అన్నారు. ఈ నెల 23న భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని వాడవాడల ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.
- **పోలవరం :** ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్, ఎంపీడీవో జి.శ్రీను, ఎస్‌ఐ పవన్ కుమార్, ఏవో కె రాంబాబు, ఏపీఎం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- **పెదవేగి :** లక్ష్మీపురంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించామని బోయపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. కళ్లజోళ్లు అవసరమైనవారికి శంకర్ నేత్రాలయం ద్వారా ఉచితంగా అందిస్తామని వైద్యులు తెలిపారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం జరుగుతుందని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల భక్తులు దేవాలయం వద్ద జరిగే హుండీ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.
- చేయిపట్టి లాగడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు పెదపాడు మండలం దాసరిగూడేనికి చెందిన మహిళ ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన పుట్టా మహేష్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై కె.శుభశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.
- **టి.నరసాపురం :** సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం స్థావరంపై దాడి చేశారు. ఒకరిని అదుపులోకి తీసుకుని 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సాయుధ బలగాల కవాతు



గ్రామాల్లో సాయుధ బలగాలు, పోలీసుల కవాతు

భీమడోలు, మార్చి 21: మండలంలోని సూరప్పగూడెం, భీమడోలు గ్రామాల్లో సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పారామిలటరీ బలగాలకు అవగాహన కోసం ఈ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ బీబీ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ విద్య, ఎస్‌ఐ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జన సేన ఆత్మీయ సభపై ఆరా

ఏలూరు క్రైం : దెందులూరు నియోజకవర్గ స్థాయి జనసేన కార్యకర్త ఆత్మీయ సభ కొఠారు ఆదిశేషు క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేశారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో రావడంతో రోడ్డుపై సభ ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళికి ఇది విరుద్ధమని టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్ కొఠారు ఆదిశేషును ప్రశ్నించారు. తక్షణం అక్కడ నుంచి తొలగించాలన్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ మంది రావడంతో ఇబ్బందులు తలెత్తాయని, క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

తహసీల్దారు వద్ద నిందితుల బైండోవర్

పెదవేగి: గతంలో జరిగిన ఎన్నికల్లో వివాదాలు, కొట్లాటలతో కేసులు నమోదైన పలువురు నిందితులను తహసీల్దారు సూర్యప్రభ వద్ద ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ బైండోవర్ చేశారు. వివాదాలకు పాల్పడరాదని వారి నుంచి తహసీల్దారు హామీ తీసుకున్నారు.



అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణానికి తీసివదిలిన భారీ గోతులు

ఎక్కడి గోతులు అక్కడే..

» పీహెచ్‌సీ భవన నిర్మాణానికి తీసిన గోతులు

» భయాందోళనలో హాస్టల్ విద్యార్థులు, స్థానికులు

నూజివీడు టౌన్, మార్చి 21: నూజివీడు పట్టణం రామాయమ్మరావు పేటలో అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం తీసిన గోతులను సంబంధిత కాంట్రాక్టరు వదిలివేయడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణపరిధిలోని రామాయమ్మరావుపేటలో బీసీ హాస్టల్ సమీపంలో అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణానికి నిర్ణయించారు. సంబంధిత కాంట్రాక్టరు పునాదుల ఏర్పాటుకు బీసీ హాస్టల్ పక్కనే భారీగోతులను తీశారు. ఇళ్ల మధ్య పీహెచ్‌సీ ఏర్పాటు చేయడంపై నాటి కొవిడ్ పరిస్థితుల్లో స్థానికులు పీహెచ్‌సీ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. సంబంధిత అర్బన్ పీహెచ్‌సీ కోనేరుపేటకు తరలిపోగా రామాయమ్మ రావుపేటలో తవ్విన పునాదులను కాంట్రాక్టరు యథావిధిగా వదిలివేయడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీసీ హాస్టల్ విద్యార్థులు కూడా అక్కడే ఉండడంతో తక్షణం అధికారులు స్పందించి గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు వైస్‌చాన్సలర్ అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్

నూజివీడు టౌన్, మార్చి 21: ఆర్జీయూకేటీ పరిధిలో గేట్- 2024 లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆర్జీ యూకేటీ వైస్‌చా న్సలర్ విజయ్‌కు మార్ అభినందిం చారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో అంతర్భాగంగా నడుస్తున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు గేట్-2024లో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారిని గురువారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాలరాజు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డి.శ్రావణి, క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ ధనబాలాజి, ఓ.ఎస్.డి సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు అధికారులకు ఉగాది పురస్కారాలు

ఏలూరు క్రైం, మార్చి 21: ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు, అగ్నిమాపక, పోలీస్ అనుబంధ శాఖలలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి వివిధ పతకాలను ప్రకటించింది. ఈ పతకాలు పొందిన వారిలో జిల్లాకు చెందిన అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. జిల్లా ఏఎస్పీగా పనిచేసి, ఎన్నికల నియమావళి బదిలీల్లో కాకినాడ ఏఎస్పీగా బదిలీ అయిన ఎంజెవి భాస్కరరావుకు ఉత్తమ సేవా పతకం ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు సమీపంలోని పెదవేగి డీటీసీలో ఎస్‌ఐగా పనిచేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయ పీఆర్వోగా పనిచేసిన ఎస్‌ఐ కేశవరావు (ఎస్‌ఐ 1008)కు, ఏలూరు త్రి టౌన్ ఏఎస్‌ఐ కె గోవిందరాజు(ఏఎస్‌ఐ 4)కు, పెదవేగి హెడ్‌కానిస్టేబుల్ పిఎస్‌వి ప్రవీణ్ (హెచ్‌సి 1719), ఏలూరు జిల్లా ఆర్మ్‌డు రిజర్వుడు విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కెఎస్‌ఎన్ మూర్తి (ఎఆర్‌హెచ్‌సి 1097)లకు సేవా పతకం ప్రభుత్వం ప్రకటించింది.

పీడీఎస్ రైస్ పట్టివేత

లింగపాలెం, మార్చి 21:లింగపాలెం మండలం సింగగూడెంలో పీడీఎస్ రైస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సింగగూడెం గ్రామానికి చెందిన మండా రమేష్ పీడీఎస్ రైస్ అక్రమంగా నిల్వఉంచినట్లు సమాచారం అందడంతో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. 805 కేజీల సివిల్ సప్లై అధికారులకు అప్పచెప్పినట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు.

ఏలూరు నగరంలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ప్రసాద్, రామారావు, సిబ్బంది జిల్లా పరిషత్ సెంటర్ వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని వారికి జరిమానాలు విధించారు. ఎస్‌ఐలు మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ఖచ్చితంగా వాహనానికి సంబంధించిన రికార్డులు, ఇన్సూరెన్సు, వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు.

గ్యాస్ బండ పేలి పూరిల్లు దగ్ధం

దెందులూరు, మార్చి 21: గ్యాస్ బండ పేలి పూరిల్లు దగ్ధం కావడంతో పాటు వివాహం కోసం దాచిన నగదు పూర్తిగా కాలిపోయింది. కొత్తగూడెం శివారు శింగగూడెం శివారులో గోదావరి కాల్వ గట్టు సమీపంలో సింగవరపు రమణమ్మ ఇంట్లో బుధవారం రాత్రి గ్యాస్ లీకైంది. గమనించని రమణమ్మ స్టౌ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ నెల 23న కొడుకు కుమార్తె పెళ్లి కావడంతో ఖర్చుల నిమిత్తం రూ.1.10 లక్షలు అప్పు తెచ్చి ఇంట్లో ఉంచారు. తాటాకిల్లుతో పాటు నగదు కూడా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మొత్తం కాలిపోయింది. మంటలు పక్క ఇళ్లకు వెళ్లకుండా వారు అదుపు చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు.

అంగన్వాడీ కేంద్రం మూత

ద్వారకాతిరుమల, మార్చి 21: వేంపాడులోని చవలవారిగూడెం అంగన్‌వాడీ కేం ద్రం కొన్నాళ్లగా మూతపడింది. 20 రోజులు నుంచి అంగన్‌వాడీ కార్యకర్త కేంద్రానికి తాళాలు వేసి ఉంది. ఇక్కడి కార్యకర్త మహిళలను ఇబ్బందులు పెడుతోందని స్థాని కులు ఫిర్యాదు చేశారు. తమ పిల్లలను కేంద్రానికి పంపబోమని చెప్పారు. వైసీపీ నాయకుల అండతో అంగన్వాడీ కార్యకర్త విధులకు గైర్హాజరై కేంద్రాన్ని మూసివే స్తోందని ఆరోపించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ మేరీని వివరణ కోరగా ఆమె ఈనెల 1 నుంచి విధులకు గైర్హాజరైందని విచారణ జరిపి చర్యలు చేపడతామన్నారు.

సారా బట్టీలపై దాడులు

13 కేసులు నమోదు ..10 మంది అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సారా పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆదేశాలతో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ వారి సిబ్బంది కలిసి గురువారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 స్థావరాలపై దాడులు చేసి 13 కేసులునమోదు చేసి 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 85 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 3050 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్ 130, అక్రమంగా నిల్వ ఉంచిన మరో 13 మద్యం బాటిల్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడులు

నలుగురి అరెస్టు ..రూ.67,950..11 బైక్‌లు స్వాధీనం



ఏలూరు క్రైం,మార్చి 21 : ఎన్నికల వేళ పోలీసులంతా విధుల్లో బిజీగా నిమగ్న మై ఉంటారని మనవైపు కన్నెత్తి చూడరంటూ పేకాట నిర్వాహకులు ఎక్కడికక్కడే పేకాట స్థావరాలను పెట్టేస్తున్నారు. పెదవేగి మండలంలోని వేగివాడ గ్రామం నందికొట్కూరు, ఊటచెరువు గట్టుపై భారీ ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుల ఆదేశాలతో స్పెషల్ బ్రాం చ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి 67,950 రూపాయల నగదు, 11 మోటారు సైకిళ్ళు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని పెదవేగి పోలీసులకు అప్పగించారు.

తొలగిన బొమ్మలు, రంగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు టౌన్, మార్చి 21:నూజివీడు పీఏసీఎస్ భవనంపై వైసీపీ రంగులను తొలగించని విషయంపై 'అయినా రంగుమారలేదు' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రత్యేక కథనంపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా వైసీపీ రంగులపై తెల్లసున్నాన్ని వేసి అధికారులు చర్యలు చేపట్టి పార్టీ రంగులను తొలగించారు.

రేషన్ వాహనాల సీఎం బొమ్మలపై స్టిక్కర్లు

చాట్రాయి, మార్చి 21: మండలంలోని అన్ని గ్రామాలలోని రేషన్ పంపిణీ వాహనాలపై ఉన్న సీయం జగన్ బొమ్మలు, నవరత్నాల వివరాలపై గురువారం తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది స్టిక్కర్లు అంటించారు. మండలంలోని అన్ని గ్రామాల రేషన్ పంపిణీ వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తెప్పించి అధికారులు దగ్గర ఉండి స్టిక్కర్లు అంటించారు. అనంతరం రేషన్ డీలర్లు, రేషన్ పంపిణీ వాహనాల ఆపరేటర్లతో తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు మద్దత్తుగా వ్యవహరించినా, ప్రచారంలో పాల్గొన్నా, ఓటర్లను ప్రభావితం చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





నూజివీడు పీఏసీఎస్ భవనానికి వేసిన తెలుపు రంగు

చాట్రాయిలో రేషన్ వాహనాలకు స్టిక్కర్లు అంటించిన దృశ్యం

రోడ్డుపైనే మురుగు నీరు

» డ్రెయినేజీ నీరు వెళ్లేదారి లేక ఇబ్బందులు

» స్థానికులకు తప్పని పాట్లు



సచివాలయం ముందు అధ్వానంగా ఉన్న రోడ్డు

ఆగిరిపల్లి, మార్చి 21:ఆగిరిపల్లి, గన్నవరం రోడ్డునందు ఉన్న సచివాలయం ఎదురుగా మురుగునీరు రోడ్డుమీదకు వచ్చి అధ్వానంగా తయారయింది. పాదచారులు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ నీరు పారే దారిలేక రోడ్డుమీదుకు వస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. జగన్ పాలనలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారయిందని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి

» నూజివీడు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే పార్థసారథి

ఆగిరిపల్లి, మార్చి 21: టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి సాధ్యమని నూజివీడు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో ముస్లిం సోదరులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సాయంత్రం ప్రార్థన సమయానికి ముందు బస్టాండు వద్ద గల చిన్నమసీదులో ప్రార్థనలో పాల్గొన్నారు. పెద్దమసీదు సమీపంలో ఉన్న షాదీఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింలకు సాయం చేసినట్టు ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. రంజాన్ తోఫా అనే కార్యక్రమం టీడీపీ పాలనలోనే అమలయిందన్నారు. ఇప్పటివరకు పెనమలూరు నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ముస్లింలకు ఎంతో సాయం చేశానని, అక్కడ ఒక ఏసీ మసీదు కట్టిస్తున్నానన్నారు. ఆగిరిపల్లి పెద్దమసీదు బాగా పాడైపోయిందని ముస్లింలు తెలుపగా టీడీపీ ప్రభుత్వం రాగానే రూ.50 లక్షల నిధులను మంజూరు చేయిస్తానని, తన సొంత నిధుల నుంచి రెండున్నర లక్షల నిధులు ఇస్తానని, నూజివీడులో కూడా ఈద్గా కట్టిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. మసీదు కమిటీ ప్రెసిడెంట్ చాన్‌భాషా మాటాడుతూ జగన్ ప్రభుత్వం బీజేపీని బూచిగా చూపించి తమ ఓట్లు దండుకుందామని చూస్తుందని, నిజమైన సెక్యులర్ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబు లౌకిక వాది అని ముస్లిం ఓట్లు ఎప్పుడూ చంద్రబాబుకే ఉంటాయని తెలిపారు. అనంతరం జరిగిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు చాన్ బాషా, ఎస్.ఎస్ బాబు, సగ్గుర్తి రమేష్, మడుపల్లి గోపాల్, చిట్నేని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలతో మాట్లాడుతున్న కొలుసు పార్థసారథి



కలిదిండిలో మాట్లాడుతున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావు

కూటమి విజయం తథ్యం

» బీజేపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సలహాదారు వెంకట్రావు

కలిదిండి, మార్చి 21 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సలహాదారుడు డాక్టర్ సీఎల్.వెంకట్రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం కలిదిండిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ప్రకటించే అవకాశం ఉందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాజధాని అమరావతిని సీఎం జగన్ నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో సాగు, తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్, టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధ, కంచర్ల రామకృష్ణ, సాబర్ల సూరి, కమతం విశ్వాసం, నియోజకవర్గ తెలుగు మహిళ కార్యదర్శి శీలం కృష్ణవేణి పాల్గొన్నారు.

శివాలయ నిధుల దుర్వినియోగంపై విచారణ

ముదినేపల్లి రూరల్, మార్చి 21: గురజ గ్రామంలోని గంగాపార్వతి శివాలయంలో ఆలయ నిధుల దుర్వినియోగంపై గురువారం అధికారులు విచా రణ జరిపారు. ఆలయ నిధులు దుర్వినియోగం జరిగాయని ఈనెల 16న గ్రామస్థులు ఏలూరు జిల్లా దేవదాయశాఖ కమిషనర్ రంగారావుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏలూరు నుంచి వచ్చిన అధికారులు గురువారం శివాల యంలో విచారణ చేపట్టారు. ఈ విచారణ రెండురోజుల పాటు జరగనున్నట్టు అధికారులు తెలిపారు. దేవస్థానం భూమి కౌలుకు సంబంధించిన ఆదాయం దుర్వినియోగం జరిగినట్టు గ్రామస్థులు విచారణ అధికారులకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిగిన తరువాత వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.



చెక్కపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించొద్దు

» చెక్కపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

ముసునూరు, మార్చి 21: వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లను బిగించవద్దని చెక్కపల్లి సబ్‌స్టేషన్ వద్ద గురువారం రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు కాటేపల్లి లింగరావు, రైతులు మందలపు రాధ, కాటేపల్లి ప్రసాద్, తుమ్మల జగన్‌మోహన్‌రావు, కంచర్ల ధర్మరావు, చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వ్యవసాయానికి ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని కొనసాగించాయని, ప్రస్తుతం ఈ ప్రభుత్వం పథకానికి మంగళం పాడి రైతులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ చేపట్టిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకిస్తే, సీఎం జగన్‌రెడ్డి మాత్రం మీటర్లు బిగిస్తామని కేంద్ర ప్రభుత్వం వద్ద కోట్లాది రూపాయాలు తీసుకున్నాడని విమర్శించారు. ఈ ప్రభుత్వం రైతును భక్షించే ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టాన్ని చేకూర్చే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలని, రైతుల అంగీకారం లేకుండా మీటర్లు బిగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. రైతుల అంగికారంతోనే మీటర్ల ప్రక్రియ చేపడతామని ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రైతులకు చెప్పడంతో ఆందోళన విరమించారు.

డ్రెయినేజీ నీటి ప్రవాహానికి తూములు ఏర్పాటు



తూముల ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ఝాన్సీసురేష్

కైకలూరు, మార్చి 21: మండవల్లిలో డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ అధికారులు చొరవ తీసుకున్నారు. మండవల్లిలోని కైకలూరు సందులో డ్రెయినేజీ నీటి ప్రవాహానికి అవకాశం లేకుండా రోడ్డు నిర్మించినందున గురువారం పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డుకు తూములను ఏర్పాటు చేసి మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీసురేష్‌బాబు పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ పసుపులేటి నాంచారయ్య, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూజివీడులో బీసీ జెండా ఎగరాలి



ముక్కొల్లుపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ముద్దరబోయిన

నూజివీడు, మార్చి 21 : నూజివీడు నియోజకవర్గంలో బీసీ జెండా ఎగిరేలా వచ్చే ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కొల్లుపాడు గ్రామంలో అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత రెండు సందర్భాల్లో బీసీ వ్యక్తిగా పోటీ చేసి అన్నివార్య కారణాలతో ఓటమి పాలయ్యానన్నారు. ఈసారి టిక్కెట్ రాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను గెలుస్తానని నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడపుతానన్నారు. గత పదేళ్లలో తన కార్యకర్తలే బలంగా ముందుకు సాగారన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో దిగుతున్న తనను ఆశీర్వదించాలన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి మృతి



భానుమూర్తి (ఫైల్)

కలిదిండి, మార్చి 21 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలిదిండి మండలం కొండంగి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన తరగల భానుమూర్తి (55) తన మరదలు అంకాల లక్ష్మితో మోటారుసైకిల్‌పై గురువారం కొండంగి ప్రధాన రహదారిపై వెళ్తుండగా వ్యాన్ ఢీకొట్టింది. వారిద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భానుమూర్తికి తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వాహనాన్ని ఢీకొట్టిన మోటారుసైక్లిస్టుకు గాయాలు

ముదినేపల్లి, మార్చి 21 : ఆగి ఉన్న వాహనాన్ని బైక్‌పై వెళుతూ ఓ వ్యక్తి ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రి పాలైన ఘటన ముదినేపల్లి సమీపంలో జరిగింది. బుధవారం రాత్రి వడాలికి చెందిన శెట్టి పాండురంగారావు ముదినేపల్లి వైపు బైక్‌పై వస్తుండగా, రోడ్డు మార్జిన్‌లో నిలిపిన వాహనాన్ని ఢీకొట్టాడు. కింద పడిపోయిన అతడికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీ.. కేసు నమోదు

ముసునూరు, మార్చి 21: ఆటో వాహనం చోరీకి గురైన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేశామని ముసునూరు ఎస్‌ఐ కె.వాసు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. చింతలవల్లి గ్రామానికి చెందిన బెజవాడ కామేశ్వరరావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 17తేదీన రాత్రి కిరాయికి వెళ్లి వచ్చి ఆటోను ఇంటి అవరణలో పెట్టాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను అపహరించుకుపోయారు. ఆటో ఆచూకీ కానరాకపోవడంతో బాధితుడు కామేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆటో చోరీ చేసిన వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

యువకుడిపై పోక్సో కేసు

కలిదిండి, మార్చి 21 :ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ప్రియకుమార్ గురువారం తెలిపారు. గుర్వాయిపాలెంకు చెందిన యువకుడు కొంతకాలంగా ఓ బాలికను ప్రేమిస్తున్నానని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కొబ్బరి బొండాలకు పెరిగిన గిరాకీ



ముదినేపల్లిలో కొబ్బరి బొండాలు

ముదినేపల్లి, మార్చి 21 : వేసవి వస్తుందంటేనే ముందస్తుగా మార్కెట్‌లో దర్శనమిచ్చేవి కొబ్బరి బొండాలు. ఎండలు ముదురుతున్నందున బొండాలకు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా పెరిగాయి. ముదినేపల్లి ప్రాంతంలో కొబ్బరిబొండం సైజును బట్టి ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 వరకు వ్యాపారులు అమ్ముతున్నారు. రోడ్డు పక్కన మోటారుసైకిళ్లపై పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. కొబ్బరిచెట్ల పెంపకం తగ్గిపోవడంతో బొండాల ఉత్పత్తి తగ్గింది. ముదినేపల్లి ప్రాంత వ్యాపారులు ఏలూరుపాడు, కాళ్లకూరు, బంటుమిల్లి ప్రాంతాల నుంచి కొబ్బరిబొండాలను కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు. వ్యాపారులు కొబ్బరి బొండాం ఒక్కింటికి రూ.12కు కొనుగోలు చేయడం, రవాణా చార్జీలు పెరగడంతో ధరలను పెంచాల్సి వస్తుందని చెబుతున్నారు.

విద్యుత్‌వైర్లు తగిలి రెండు తాటిచెట్ల దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కైకలూరు, మార్చి 21: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు తాటిచెట్లు దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. పల్లెవాడ గ్రామంలో ఓ ఖాళీ స్థలంలోని తాటిచెట్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు వెళ్లాయి. గాలికి విద్యుత్‌వైర్లు చెట్లకు తగిలి మంటలు వ్యాపించాయి. ఈ ఘటన చూసిన స్థానికులు వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. వారికి సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఆధ్యాత్మికం

అమృతేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుదర్శనయాగం

ముదినేపల్లి రూరల్, మార్చి 21: సింగరాయపాలెం గంగాపార్వతి సమేత అమృతేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేశారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, అంకురా ర్పణ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, పూజలు అనంతరం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

● సింగరాయపాలెం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ కల్యాణ మహోత్సవాలలో భాగంగా రెండో రోజు గురువారం సుదర్శనయాగం నిర్వహించారు. యాగంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి రామాలయం ప్రతిష్ఠోత్సవాలు



విశ్వనాద్రిపాలెంలో నిర్మించిన రామాలయం

ముదినేపల్లి, మార్చి 21 : పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో ఈనెల 23 నుంచి సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. దాతల విరాళాలు సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన నూతన ఆలయంలో 24న స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ, 23 నుంచి ఆలయం వద్ద హోమ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలతో పాటు వినాయకుడు, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

ముసునూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ బదిలీ



మేనేజర్ శ్రీనివాసరావుకు జ్ఞాపికను అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

ముసునూరు, మార్చి 21: ముసునూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న జోనుబోయిన శ్రీనివాసరావు పదోన్నతిపై నూజివీడు కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. రెండేళ్ల నుంచి ముసునూరు బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం బ్యాంక్, సొసైటీ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. నూజివీడు నుంచి రంగప్రసాద్ ముసునూరు బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



చెక్కపల్లిలో ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వాసు

ముసునూరు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.వాసు హెచ్చరించారు. గురువారం చెక్కపలి లో ఎన్నికల కోడ్‌పై ప్రజలు, రాజకీయ నాయకులకు ఆయన అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అనుమతులు లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించిన, మైక్‌లు, లౌడ్ స్పీకర్లు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిష్కళంకమాత ఉత్సవాలు ప్రారంభం



వలసపల్లి నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న విచారణ గురువులు జోసఫ్ తంబి

ముసునూరు, మార్చి 21: ముసునూరు ఆర్‌సీఎం చర్చి విచారణ పరిధిలో వున్న నెహ్రూనగర్ నిష్కళంక మాత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వలసపల్లి నుంచి నిష్కళంక మాత కొండవరకు క్రైస్తవ యువకులు ఉత్సవాల జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉత్సవాల నిర్వాహకులు, ఫాదర్ జోసఫ్ తంబి ప్రారంభించారు. సాయంత్రం అర్పాణలయం ఫాదర్లు జోయ్ అమల్, నోవిస్ పతాక అవిష్కరణ చేసి ఉత్సవాలు ప్రారంభించారు. విజయనగరం జిల్లా చింతలవలస పాధర్ ప్రగాశం దివ్య బలిపూజ నిర్వహించారు. రమణక్కపేట విచారణ గాయక బృందం అలపించిన పలుగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాల ఏర్పాట్లను వాక్యోపదేశకులు దేవరపల్లి బెనర్జి, చీలి స్వామిదాసు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

'ఎన్నికల నిబంధనలు అమలు పరచాలి'



రావిచర్లలో సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

నూజివీడు టౌన్, మార్చి 21:ఎన్నికల నిబంధనలు తప్పకుండా అమలు చేసేందుకు సిబ్బంది కృషిచేయాలని నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ సూచించారు. నూజివీడు మండల పరిధిలోని బోర్వంచ, కొత్తరావిచర్ల, పాతరావిచర్ల గ్రామ సచివాలయాలను గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. అనుమతులు లేకుండా ఎటువంటి పార్టీ సమావేశాలు జరపకూడదని, జరిగే పరిస్థితులు ఉంటే తక్షణం ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఎంపీడీవో, సిబ్బందికి సూచించారు.